# కుర్రవెధవ

సీతారాముడు హిప్పాటిజం నేర్చుకుంటున్నాడని విని నేనాట్టే హర్షించలేదు. ఎందువల్లనంటే బావమరదులు సరికొత్త విద్యలు నేర్చుకుని ప్రజ్ఞావంతులనిపించుకుంటున్నారంటే ఆనందించి సెహబాసని భుజంతట్టే వంశంకాదు మాది. మా పద్ధతులే వేరు. సొంతభార్య సొంతతమ్ముడు ఇంతటి అభివృద్ధిలోకి వస్తున్నాడంటే హర్షించి, ఆనందించి, సంతోషపడి తడి కళ్ళతో పరవళ్ళు తొక్కకపోవటానికి ఇంకో కారణం గూడా వుంది. అదేవిటంటే, ఈ సీతారాముడి ప్రజ్ఞాపాటవాలతో నాకు సన్నిహితమైన పరిచయం ఉంది గనక.

నేను పెళ్ళి చూపులకంటూ వాళ్ళింటికి వెళ్ళిన రోజునే ఈ సీతారాముడు పదవక్లాసు పరీక్ష ఫీజు కట్టాలంటూ వెళ్ళిన సంగతి నాకు బాగాగుర్తు. ఆ రోజు తిధి, వార నక్షత్రాలు నాకయితే గుర్తులేవు గాని, అప్పట్నించి ఇప్పటిదాకా, అంటే గత పదేళ్ళుగా పెళ్ళిచేసుకుని నేను, టెన్త్‌దాటలేక వాడు ఇద్దరం నిశ్శబ్దంగా నెత్తి బాదుకుంటూనే వున్నాం.

సరే అదలావుంచి అసలు విషయంలోకి వస్తే, ఆరోజు నా సగం శరీరం అంటే అర్ధాంగి– పేరేమో గజలక్ష్మి మనిషి మాత్రం గజంబద్దంత ప్రమాణంలో వుంటుంది. చిన్నతనంనించీ వాళ్ళింట్లో ఈవిడ్ని 'గజం గజం' అంటూ పిల్చేవాళ్ళట. ఎవడినోట్లో ఏ వుందో తెలీదుగాని ఈవిడ మాత్రం తథాస్తు అన్నట్లు నిలువు మర్చిపోయి అడ్డం పెరిగింది. పెళ్ళయ్యాక మనుషులు సాగుతారని మానాయనమ్మ నాకోథియరీ సోదాహరణంగా చెప్పింది. కాబోలనుకుని

తలూపాను. గజలక్ష్మి మాత్రం ఏమాత్రం సాగకుండా అలాగే వుండిపోయి రికార్డు ముక్కలు చేసింది. పెళ్ళాల్ని పీక్కుతినే వంశమే గాని వదిలిపెట్టే వంశం కాదుగాబట్టి కాంప్రమయిజయ్యి కాపురం నెట్టుకొస్తున్నాను) గునగునా చేటంత మోహంతో వచ్చి "చూసేరా– మాచిన్నాడు (అంటే మన కథానాయకుడు సీతారాముడు) కమ్యూనిజం ప్రాక్టీసు చేస్తున్నాట్ట" అంటూ ప్రకటించింది.

నాకేం అర్థమై చావలేదు. కమ్యూనిజం ఏవిటి, నేర్చుకోవటం ఏవిటీ అని, వెంటనే అనుమానం గూడా వచ్చింది. ఏమో కమ్యూనిజాన్ని క్లాసులు పెట్టి నేర్పి పరీక్షలూ అవీగూడా పెడుతున్నారేమోనని (మా వంశీయులకి రాజకీయాలకి, సిద్ధాంతాలకి మధ్యన చాలా దూరం కాని మా ఇంట్లో ఎప్పట్నించో వున్న గాంధీ గారి ఫోటో చూసినప్పుడల్లా కడుపు తరుక్కుపోతుంది. అంచేతే ఎన్నికలప్పుడు గాంధి టోపీలకే ఓట్లు వేస్తున్నాం)

"కమ్యూనిజం ప్రాక్టీసు చెయ్యటం ఏమిటే నీ తలకాయ్. అదేంకబాడీ ఆటా! అన్నాన్నేను కాస్తంత విసుగ్గా (పెళ్ళాలతో నవ్వుతూ మాట్లాడకూడదని మా తాతగారు చెప్తుండేవాడు. అలా నవ్వి చనువిస్తే వాళ్ళు భుజాలపైకెక్కి కూర్చుంటారని ఆయన చెప్పేవాడు. గజలక్ష్మిని, ఆకారాన్ని చూసినప్పుడల్లా ఆయన చెప్పినసంగతి గుర్తుకొచ్చి నవ్వే ధైర్యం చేయలేకపోతున్నాను)

"అదేవిటో మీరే చూడండి" అంటూ వుత్తరాన్ని నా వొళ్ళోకి గిరాటేసి దొర్లుకుంటూ వెళ్ళిపోయింది.

తీరా వుత్తరం చూద్దునుగదా... హిప్నాటిజం నేర్చుకుంటున్నాట్ట. అదీ సంగతి। పైగా తన ప్రతాపానికి చిహ్నంగా చిన్న విషయం వుదాహరణగా కూడా రాసేడు–

అదేవిటంటే–

ఇంటి ఓనరు– చెదలు తినివెయ్యగా మిగిలిపోయిన పాతకాలం కావిడిపెట్టె లాగా వుంటాడు– అద్దెకోసం వచ్చేట్ట మనవాడు అతగాడ్ని మాటల్లోపెట్టి మెల్లిమెల్లిగా అతడిక్కూడా తెలీకుండానే హిప్నటయిజ్ చేసి 'అద్దె మీకు ముట్టింది పూర్తిగా ముట్టింది. అస్సలు బకాయేలేదు' అంటూ వీడంటుంటే ఆ పెద్దమనిషి వర్షానికి తడిపిన వాసంలాగా బిర్రబిగుసుకుపోయి, "అవును.... అవును.... ముట్టింది. పూర్తిగా. ఎప్పుడో.." అనుకుంటూ వెళ్ళిపోతున్నాట్ట.

ఇదంతా మూడు నెలలుగా సాగుతోందట. ఆ పెద్దమనిషి వీడిదెబ్బకి భయపడిపోయి ఈ ఇంటి ఛాయల కూడా రాకుండా 'మీ చిన్నవాడు ఇంట్లో వుండని తారీకు, సమయం వ్రాస్తే నేవచ్చి మీ సమక్షంలో సొంత కడుపు చించుకోవాలి' అంటూ పక్షవాతంతో పర్మనెంటుగా మంచంలో వున్న మా మావగారికి లోకలు ఉత్తరాలు వ్రాస్తున్నాట్ట. ఇదంతా రాసి చివర్లో–'బావా–

దిగులుపడక– మనకి మంచి రోజులొచ్చేసినాయ్. ఈ విద్యతో మన సమస్యలన్ని ఇట్టే పరిష్కారం అయిపోతాయి! నాన్నకిగూడా ప్రస్తుతం నేనే ట్రీట్ చేస్తున్నాను. అస్సలు మాటలు రాని స్థితిదాటి, నన్ను చూడంగానే 'ఫోరా–ఫోరా' అంటున్నాడు. బహుశా నీ దగ్గరికి వెళ్ళమంటున్నట్లుగా అర్థం చెప్పుకుంటున్నాను. కోర్సు పూర్తికాగానే వీలు చూసుకుని వస్తాను. ధైర్యంగా వుండు– ఇదీ సారాంశం.

అసలీ సీతారావుడి చరిత్ర పూర్తిగా చెప్పగలిగితే, హాస్య పురాణం వ్రాయగలిగితే సంపూర్ణ హాస్యనవల (ఏకైక కామెడీ రైటర్కి గూడా తెలీనంత హాస్యం) తీయగలిగితే మాంచి కమెడీ పిక్చర్ తయారయ్యి జూబ్లీ (బూతు డైలాగులు లేకపోయినా సరే) చేసుకు తీరుతుంది.

తను పదోక్లాసు పాసవటం ప్రభుత్వానికి ఇష్టం లేదు. కనుకనే ఇలా పనిగట్టుకుని తనని ముందుకు పోకుండా పడగొడుతున్నారని, దీని వెనకాల విదేశీ హస్తం. స్వదేశీకుట్ర పూర్తిగా వున్నాయని, అంచేతనే పరీక్షలనే బానిసత్వపు వ్యవస్థలోంచి బయటపడి తనకి తాను స్వాతంత్ర్యం పుచ్చుకుంటున్నానని (స్వాతంత్ర్యం అనేది ఒకళ్ళు ఇచ్చేదికాదు. మనకి మనమే పుచ్చుకోవాలని గాంధీ గారు ఎప్పుడో ఎక్కడో అన్నారట) ప్రకటించి, ఇంట్లోంచి బయటికొచ్చిన క్షణంతో మాసీతారావుడి పబ్లిక్ జీవితం ప్రారంభమైంది.

మొట్టమొదటగా వారు కబాడీ ఆట వైపుగా ఆకర్షితులయ్యారు. ఒక సాయింత్రం ఆ వూళ్ళోని ఒక కబాడి జట్టులో వీడూ విలీనం అయ్యిపోయేట్ట. సరే– కుర్రాడు కొత్తగా వచ్చాడుగదాని కూత కెళ్ళిరమ్మంటే మధ్యగీత దాటి ఒక్క అడుగు మాత్రం వేసి చేతులు కట్టుకు నిల్చుని 'కబాడీ... కబాడీ" అనటం మొదలు పెట్టేట్ట. నాలుగు గంటలకి మొదలెట్టిన కూత సూర్యాస్తమానం అయి చీకటి పడినా ఆపట్ట. వీళ్ళేమో పొమ్మంటార్ల. వాళ్ళేమో రమ్మంటార్ట. రాడు. పోడు.

ఆపడు. ఇరు పక్షాల వాళ్ళు ముందు ఆశ్చర్యపడి. తరవ్వాత భయపడ్డారట. ఆశ్చర్యపడింది ఇతగాడివి పూపిరితిత్తులా వుల్లిపాయి సంచులా ఇంతసేపు దమ్ము బిగించటానికిన్నిన్ని, ఇహభయపడిందేమో, ఇతడి వల్ల ఈ ఆటే అంతరించి పోతుందన్నిన్ని... వెంటనే ఇరుపక్షాల వాళ్ళు కలిసి ఈ కబాడీ ఆట ఇంకా పది కాలాలు పచ్చగా వుండాలంటే ఇతగాడు వుండటానికి వీల్లేదని ఏకపక్ష నిర్ణయం చేసి ఇంకో ఆట చూసుకోమని కళ్ళనీళ్లు పెట్టుకున్నారట. చేతులు పుచ్చుకు బ్రతిమాలారట.

ఏమాట కామాట చెప్పుకోవాలి. సీతారావుడిది జాలి గుండె ఇట్టే కరిగిపోతాడు. సరే అన్చెప్పి కబాడీ కొలీగ్స్కి గుడ్బై చెప్పి అటు క్రికెట్ జట్టులో జాయినయ్యేడట. మొదటిరోజే జట్టుకుర్రాళ్ళంతా ఆట తెలుసా అనడిగితే ఓ అంటూ తలూపేట్ట. సరే అయితే బౌలింగ్ చెయ్యమన్నారట.

ఇహనంతే ఇద్దరు వికెట్కీపర్లు మంచాన పడ్డారు. ఒకడేమో గడ్డం నుజ్జు నుజ్జు అవటం వల్లనూ. ఇంకోడేమో సెన్సిటివ్ పార్ట్స్ సివియర్గా డామేజీ అవటం వల్లనూ పోనీ బ్యాటింగు చేయిద్దామని ట్రయ్ చేస్తే రెండు దెబ్బలకి ఉన్న రెండే రెండు బంతులూ అయిపు లేకుండా ఫ్లయింగ్ సాసర్లాగా పక్క వూళ్ళోకెళ్ళి పడ్డాయట. దాంతో క్రికెట్ వాళ్ళు కూడా కబాడీ వాళ్ళలాగే కళ్ళనీళ్ళు పెట్టుకుని ఇతగాడి చేతులు పుచ్చుకుని ఇవి చేతులు కావన్నారట. మరయితే మీ భాషలో వీటిని ఏవంటారని నిజాయితీగా అడిగేట్ట. కాళ్ళు అన్నారట. ఈ డొంకతిరుగుడు వ్యవహారం నచ్చక మానేసాడట.

ఆపైన ఆలోచించగా ఆలోచించగా జ్ఞానోదయం అయిందిట. సారాంశం ఏమిటంటే– వాళ్ళతో వీళ్ళతో తనకేల? సర్వ స్వతంత్రంగా ప్రాక్టిసు చేయగల విద్య ఏమిటాని ఆలోచించి చూడగా కరాటే కంట పడిందట– ఇహనంతే– మొదలు పెట్టేట్ట.

సరిగ్గా ఆ రోజుల్లోనే మా మావ పక్ష వాతంతో మంచానపడ్డాడు. చూద్దామని బయల్దేరి వెళ్ళేను. పరామర్శలు, కంట తడులు, ధైర్య వచనాలు, భోజనాలు పూర్తయినాయ్ దొడ్లో జామచెట్టు క్రింద నాకు, మందార చెట్టు క్రిందమెలికలు తిరిగిపోయిన మామగార్కి మంచాలు వేసి పడుకోపెట్టేరు. ప్రయాణబడలికలో వున్నానేమో ఎవళ్ళో జోకొట్టినట్టు ఇట్టే నిద్రపట్టేసింది.

ఒక రాత్రివేళ వున్నట్టుండి మెళుకు వచ్చింది. ఎవరోగాని 'హూ–ఆ–హూ' అంటూ అరుస్తున్నారు. మావగారు మజిలీ ఎత్తేసుంటారని వులిక్కిపడి లేచి చూద్దును గదా. మెలికలు తిరిగిన మామగారు మహరాజులా వొంటిపైన బట్ట గూడా లేకుండా (మహరాజులు బట్టలిప్పుకు పడుకుంటారాని అడక్కండి). మంచి నిద్దట్లో వున్నారు. ఆయన గురక జీటీ బండి కూతలా వినిపిస్తూనే వుంది.

తలతిప్పి చూద్దునుగదా సీతారావుడు పాకి దొడ్డి గోడముందు నిల్చుని 'హూ– ఆ–హూ' అంటూ అరుస్తూ చేతుల్ని గాలిలో వెనక్కి ముందుకి ఆడిస్తూ ఆయాసపడిపోతున్నాడు. చెప్పొద్దూ నా మనస్సు ఎందువల్లనో గాని కీడు శంకించింది. ఒక్క పరుగున వెళ్ళి వాడి భుజాలు పుచ్చుకుని "ఏవిటోయ్ ఇది ఛ– ధైర్యంగా వుండాలి మరి" అన్నాన్నేను. నా చేతుల్లోంచి విడిపించుకుంటూ

"కరాటే.... కరాటే..." అని మళ్ళీ 'హూ–ఆ–హూ' అనటం మొదలు పెట్టేడు. అప్పుడర్థం అయింది నాకు కరాటే ప్రాక్టీసు చేస్తున్నాడని.

నేను తిరిగొచ్చిన పదిరోజుల్లోనే మహ లక్ష్మి సమానురాలైన అత్తగారు గుమ్మడి కాయంత అక్షరాల్తో వుత్తరం వ్రాసింది. సారాంశం ఏవిటంటే– సీతారావుడు తెల్లారకట్ట ఆడుకుంటున్న ఆటలో, వెన్నుపూస క్రింద నరం గట్టిగా పట్టింది. అందువల్ల వాడు సుడిగాలికి వొంగిపోయిన పొట్ల పాదులాగా వెనక్కి వాలిపోతున్నాడు. హోమియో, ఆయుర్వేదం అయిపోయి ప్రస్తుతం సీతాపతివద్ద అల్లోపతి వైద్యం మొదలు పెట్టాము. మీ మావగారి పరిస్థితి అల్లాగే వుంది. కోపంగాని, రోగం గాని ఏ మాత్రం తగ్గలేదు– అని.

ఆ దెబ్బతో సీతారావుడు కరాటేకి స్వస్తి చెప్పి వెంటనే హిప్నాటిజం టేకప్ చేసాడన్నమాట– అదీ సంగతి.

వాడొస్తున్నాడంటే నా మనస్సు మనస్సులో లేదు. ఏవిటో బీతాహం, భయం.

రెండ్రోజుల తర్వాత ఇంకా తెల్లవారక ముందే దిగడ్డాడు సీతారావుడు. భుజానికో ఎయిర్‌బ్యాగ్, చేతిలో వుండగా చుట్టిన ముందు రోజు తెలుగు పేపరు.

–ఏవిటి బావా విశేషాలు" అనడిగాడు వస్తూనే.

అప్పుడే వచ్చిన ఇంగ్లీషు పేపర్ని మౌనంగా వాడికందించాను.

"అబ్బే– పేపరు సంగతులు గురించి కాదు నేనడిగింది. ఇంటి విషయాలు."

ఏ వున్నాయ్ అంతా ఇంకా కులాసాగానే వున్నాం. అవును మామగారికెలా వుంది?" అనడిగాను ఏదో అడగాలి కాబట్టి.

"ఇపుడు చాలా నయం. మాట ముద్ద ముద్దగా వస్తోంది. చాలా ఇంప్రూమెంటుంది. కేవలం హిప్నాటిజం తోటే ఇదంతా సాధ్యపడింది. ఇంకో నెలరోజులాగితే  నాన్న పూర్వంలాగా చక్కగా బూతులు తిట్టగలడు"

సరిగ్గా అదే సమయానికి గజం దొడ్లోంచి అక్కడికొచ్చి తమ్ముడ్ని చూడంగానే చింకి చేటంత మొహంతో "ఎంత సేపయింది రావచ్చి? నాన్నెలా వున్నాడు? అమ్మకి కాలువాపు తగ్గిందా? వూరగాయలు పెట్టేరా? పద్మనాభం మావయ్య కూతురికి సంబంధం కుదిరిందా? అన్నట్టు నేనక్కడ మర్చిపోయిన బూడిదరంగు జాకెట్టు తెచ్చావా?"

నాకే గనక ఆ హిప్నాటిజం ఏ మాత్రం తెల్సున్నా వెంటనే దానిమీద ఆ విద్య ప్రయోగించి నోరు మెదపకుండా పడుఔేటట్టు చేస్తుండేవాడ్ని.

కానీ నాకా విద్యరాదు. వచ్చిన సీతారావుడికి విసుగు కోపం అస్సల్లేవు– పైగా బోల్డంత సహనం. మా మావగారికి ముక్కు మీదుంటుంది కోపం. ఆయన కడుపున వీడు ఎలా పుట్టేడాని ఆశ్చర్యం, అప్పుడప్పుడు అనుమానం గూడా కలుగుతుంటాయ్ నాకు.

అక్కా తమ్ముడు వెళ్ళి వంటగదిలో సెటిలయ్యారు. సీతారావుడు వీలు చిక్కనప్పుడల్లా హిప్నాటిజం గురించి చెప్పాలని ప్రయత్నిస్తుంటే గజం మాత్రం తన సాధక బాధలు ఏకరువు పెడుతోంది. నీళ్ళు, పనిమనుషులు, నాకు ప్రమోషన్ రాకపోవటంచేత ఎంత కష్టంగా వుందో వాయిదాల పద్ధతిలో వాడికి కాఫీ లంచం ఇస్తూ చెప్తోంది.

నాలుగు రోజులు ఏ అవాంతరం లేకుండానే గడిచినాయ్.

అయిదో రోజు.....

నేను స్కూలుకి బయల్దేరాను– చదువు కోటానిక్కాదు. మా సుపుత్రుడి సీటు గురించి వాకబ్ చెయ్యటానికి ఒకటో క్లాసులో సీటు కావాలంటే మూడు వేలు డొనేషన్ కట్టాలట. అక్కడికీ మొన్నవెళ్ళి స్కూలు హెడ్డు కాళ్లపై పడి ఇవి కాళ్ళు కావండీ అంటే వెంటనే ఆయన చేతులందించేడు. వాటిని గూడా పుచ్చుకుని ఇవి చేతులు కావంటే ఆయనకు కోపం వచ్చింది. డొంక తిరుగుడు వ్యవహారాలు నాకు నచ్చవంటూనే ఈ రోజు వచ్చి కలవమన్నాడు.

అంచేతనే బయల్దేరాను నా వెనక సీతారావుడు గూడా తయారయ్యేడు. తనూ వస్తాన్న స్కూలు హెడ్‌తో హిప్నోథెరపీ అనే విద్య ద్వారా చర్చలు జరిపి ఎందుకీ విధంగా జనాన్ని పిండుతున్నాడో తెల్సుకుంటాట్ట. వాడికి గజలక్ష్మి వత్తాసు– దానికి కారణం గత నాలుగు రోజులుగా తమ్ముడి శక్తి సామర్థ్యాలపైన గజానికి ఎక్కడ్లేని గురి ఏర్పడింది. అక్కగారికి హిప్నటిజం గురించి చెప్పటమే కాకుండా చిన్న చిన్న డిమాన్ స్ట్రేషన్లు కూడా చేసి చూపాడట.

మొదటగా పనిమనిషిపైన విద్యని తెలివిగా ప్రయోగించి, అందరిళ్ళకి రెగ్యులర్గా వెళ్ళి ఈ ఇంటికి తరచు నాగాలు నెట్టటానిగల కారణం ఏమిటని అడిగితే అమ్మగారు నీళ్ళ కాఫీ పోస్తుంది, పాత చీరలు, జాకిట్లు గిన్నెల వాళ్ళకి వేసుకుంటుందే గాని నా మొహాన పడెయ్యదు. వగైరా నిజాలు కక్కేసిందట.

అలాగే అదే రోజు సాయంత్రం మా ఇంటి ఓనరు వీడ్ని పిల్చిమరీ బాతాఖానీ మొదలు పెట్టాట్ట. మా వాడి విద్యపైన తనకే మాత్రం నమ్మకంగాని, గౌరవం గాని లేవంటే ఆ మాటకి సీతారావుడు నొచ్చుకుని కోపం కొద్దీ ఆయన్ని హిప్నటయిజ్ చేసి వదిలేట్ట. దాంతో ఆయన పంచె పైకి ఎగ్గట్టి ముందుగదిలో భరత నాట్యంట. పైగా ఇపుడేం చెయ్యాలని వుంది అని వీడడిగితే ఆయన డాన్స్ చేస్తూనే మారాం చేస్తున్న ధోరణిలో 'అందమైన అమ్మాయికి కన్నుగొట్టి, పెద్దగా ఈల వెయ్యాలని వుంది' అంటుంటే ఆ మాటవిని ముసలి పెళ్ళాం ఒక్కటే గోలట.

ఇవన్ని చూసేక గజానికి వాడిమీద, వాడి విద్యమీద అంతులేని నమ్మకం ఏర్పడటంతో వాడ్ని గూడా వెంట స్కూలుకి తీసికెళ్ళమని, దానివల్ల ఎంతో మేలు జరుగుతుందని ఒకటేగోల.

కాదనలేకపోయాను.

ఇద్దరం బయల్దేరాం. త్రోవలో చాలా విషయాలు అడిగి తెల్సుకున్నాడు. చిరంజీవికి ఎన్ని మార్కులొచ్చాయి, అప్లికేషన్ నెంబరు, డొనేషన్ ఎంత కావాలంటున్నారు.... వగైరా.....ఆపైన చాలా సీరియస్సుగా వుండి తీవ్రంగా ఆలోచించటంగమనించాను.

తీరా స్కూలుని సమీపించగానే మౌనాన్ని విడిచి చిన్నపేచీ పెట్టేడు. నేను వాకిట్లోనే వుండాలట. తను మాత్రమే హెడ్‌గారి గదిలోకెళ్ళి, హిప్నోథెరపీ ద్వారా చర్చలు జరిపి డొనేషన్ లేకుండా చిరంజీవికి సీటు ఇచ్చేలాగా వొప్పించి అప్పుడు నన్ను పిలుస్తాట్ట. నేవెళ్ళి ఫార్మల్గా మొహం చూపించి వచ్చెయ్యాలట....

సరేనన్నాను. అలా అనటానికి కారణం నన్నుగూడా హిప్నటయిజు చేసాడేమో తెలీదు.

సీతారావుడు నన్ను స్కూలు కెదురుగా వున్న టీస్టాల్లో వుండమని చెప్పి పెద్ద పెద్ద అంగల్తో లోపలికెళ్ళేడు.

అలా వెళ్ళినవాడు గంట గడిచినా పత్తాలేడు. అప్పటికే నేను మూడుసార్లు టీలు, పదహారు గ్లాసుల నీళ్ళు తాగేసాను. టీస్టాలు యజమాని మూడుసార్లు టీ తాగినందుకు ఆనందపడాలో, పదహారు గ్లాసుల నీళ్ళు తాగినందుకు ఆందోళనపడాలో తెలీనట్లు వెర్రిగా నావంకే చూస్తున్నాడు.

ఆ చూపుల్ని తట్టుకోలేక లేచి బయటికొచ్చేసాను. ఇక వుండబట్టలేక మెల్లిగా స్కూలు లోపలికి అడుగుపెట్టాను. అది రెండంతస్థుల భవనం. ఇదివరలో ఆ భవనంలో ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి వుండేదట. కాని నిరుద్యోగులు వేల సంఖ్యల్లో రావటంతో రద్దీ పెరిగి వేరే పెద్ద భవనంలోకి ఆఫీసు మార్చారట. ఆ తర్వాత స్కూలు వోపెన్ చెయ్యటం జరిగిందట. క్లుప్తంగా ఇదీ స్థల పురాణం.

అంతా నిశ్శబ్దంగా వుంది. కాని ఎక్కడ్నించో గాని మాటలు పెద్దగా వినిపిస్తున్నాయ్. ఆలకించి చూస్తే అది హెడ్ మాస్టారి గొంతే. ఒకసారి వింటే జీవితాంతం గుర్తుండిపోయే స్వరం. తళుక్కాగితాన్ని గుప్పిట్లో పెట్టి నలిపినపుడు వచ్చే గరగం

శబ్దంలా వుంటుంది.

ఆందోళనగా ఆ గదివైపుగా వెళ్ళేను. హెడ్‌మాష్టారి గది టాయిలెట్‌కి, స్టోర్ రూంకి మధ్యన ఇరుక్కుపోయినట్లుంటుంది. తన గదిని అక్కడే ఎందుకు ఏర్పాటు చేసుకున్నాడో ఎవళ్ళకీ తెలీదు.

ఇంకా గదికి పది గజాల దూరంలో వుండగానే హెడ్‌మాష్టారి గొంతు స్పష్టంగా వినిపిస్తోంది. ఆయనంటున్నారు. "ఇపుడు నీకెంతో హాయిగా వుంది. చాలా హాయిగా వుంది. ఆ పుస్తకాలకి దుమ్ము దులిపి గదికి బూజు దులిపితే ఎంతో హాయిగా వుంది. రిలాక్స్ రిలాక్స్.... ఇపుడు నువ్వు ఆ చీపురు తీసుకుంటున్నావ్. తీసుకుంటున్నావ్... గుడ్... ఈ గదంతా శుభ్రంగా వూడుస్తున్నావ్... ఇంకా ఎంతో హాయిగా వుంటుంది...."

మాటలు ఆగిపోయిగినాయ్...గర్‌గర్ మంటూ చీపురు శబ్దం వినిపిస్తోంది.

నేనింకా సందిగ్ధంలో వుండగానే తలుపు తెరుచుకుని హెడ్మాష్టారు బయటికొచ్చారు. నన్ను చూసి నిశ్శబ్దంగా వుండమన్నట్లు సంజ్ఞచేసి బాగా దగ్గరగా వచ్చి చెవులో రహస్యం చెప్తున్న ధోరణిలో 'ఎవడో కుర్రవెధవ వాళ్ళ మేనల్లుడికి సీటు కావాలంటూ వచ్చి నన్నే హిప్నటయిజు చేద్దామని ప్రయత్నిస్తే నాకూ ఆ విద్య క్షుణ్ణంగా వచ్చు కాబట్టి తిప్పి కొట్టి వశపర్చుకున్నాను. రేపు ఇన్‌స్పెక్షనుంది. స్కూలంతా శుభ్రం చేయిద్దామని రావులమ్మని రమ్మంటే ఇంతవరకు అంతూ పొంతూ లేదు. సమయానికి దేవుడులాగా వచ్చేడు. మొత్తం తుడిపించేస్తా. మీరు రేపు రండి మాట్లాడదాం" అంటూండగా గదిలో చీపురు శబ్దం ఆగిపోవటంతో ఆయన దాదాపు పరిగెట్టుకుంటూనే లోనికెళ్ళిపోయారు.

నాకు సీతారావుడ్ని తల్చుకుంటే జాలేసింది. వెళ్ళి హెడ్మాష్టార్కి మొత్తం జరిగిందంతా చెప్పేయాలకున్నాను. కాని మళ్ళీ భయం. ఇప్పుడాయనికి వాడిమీద కోపమో, జాలో ఏవుందో తెలీకుండా నిజం చెప్పేస్తే చిరంజీవికి సీటు రాకపోవచ్చు.

మా సంగతి మేం చూసుకోవటం మా వంశీయులకి బాగా అలవాటు. అంచేతనే వెనక్కి తిరిగాను.

గదిలోంచి హెడ్మాష్టారి గొంతు మళ్లీ వినిపిస్తోంది. "రిలాక్స్....రిలాక్స్... హేపీగా వుంది....ఎంతో హాయిగా... ఇపుడు ప్రక్కగది గూడా వూడుస్తావ్. మనం వెడుతున్నాం. నా వెనకే నువ్వొస్తావ్... రిలాక్స్...రిలాక్స్...."

నేను మాత్రం రిలాక్సవలేదు. త్వర త్వరగా బయటపడ్డాను.